సాక్షి
తిరుపతి
మంగళవారం । 25 । ఫిబ్రవరి । 2025



రావణ, హంస వాహనాలపై స్వామి, అమ్మవార్లు

రావణబ్రహ్మపై.. శివయ్య రాజసం


హంస, యాళి వాహనాలపై పురవీధుల్లో ఊరేగుతున్న శివపార్వతులు

శ్రీకాళహస్తి:శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామివారు రావణ వాహనంపై అధిరోహించి పురవిహారం చేశారు.ఆయన పక్కనే దేవేరి జ్ఞానప్రసూనాంబ అమ్మవారు మయూర వాహనంపై స్వామి వారిని అనుసరించారు. అంతకుముందు స్వామి, అమ్మవార్లను ఆలయ నుంచి రాజగోపురం వద్దకు తీసుకొచ్చారు. అక్కడ స్వామి వారిని రావణ వాహనంపై, అమ్మవారిని మయూర వాహనంపై అధిష్టింపజేశారు. వినాయకుడు మూషిక వాహనం, శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, చండికేశ్వరస్వామి, భక్తకన్నప్ప చప్పరాలపై స్వామి, అమ్మవార్లను అనుసరించారు.

హంస, యాళి వాహనాలపై పురవిహారం

సోమవారం ఉదయం శ్రీకాళహస్తీశ్వరుడు బంగారు హంస, జ్ఞానప్రసూనాంబ అమ్మవారు బంగారు యాళి వాహనాలపై పురవీధుల్లో విహరిస్తూ కనువిందు చేశారు. మూషిక వాహనంపై వినాయకస్వామి, చప్పరాలపై శ్రీవల్లీ, దేవసే సమేత కుమారస్వామి, చండికేశ్వరుడు, భక్త కన్నప్ప కొలువుదీరారు. కళాకారుల కోలాటాల నడుమ, శివనామ స్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి.

నేడు నాగరాత్రి

శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రాత్రిని నాగరాత్రిగా వ్యవహరిస్తారని అర్చకులు తెలిపారు.

నేడు శేష, యాళి వాహనసేవలు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం రాత్రి శివపార్వతులు బంగారు శేష, యాళి వాహనాలపై పురవీధుల్లో ఊరేగనున్నారు. ఉదయం బంగారు హంస, చిలుక వాహనాలపై విహరించనున్నారు.

నేడు శ్రీకాళహస్తీశ్వరుడికి సారె సమర్పణ

జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం తరపున సారె సమర్పించనున్నారు. ముక్కంటి ఆలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పట్టువస్త్రాలు అందజేయనున్నట్టు ఈవో బాపిరెడ్డి తెలిపారు. అందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో నేడు

నాలుగవ తిరునాళ్లు - నాగ రాత్రి (మాఘ బహుళ ద్వాదశి)

వాహన సేవలు

ఉదయం 9గంటలకు:హంస–శుక వాహనసేవ
ఉభయదాతలు:ఎస్వీ.ముద్దుకృష్ణారెడ్డి,(42ఎకరాల భూదాత), జ్ఞాపకార్థం, చుక్కలనిడిగల్లు గ్రామం
రాత్రి 8 గంటలకు శేష – యాళి వాహనసేవ
ఉభయదాతలు : పేట జనార్దన్‌రావు(అడ్వకేట్), శ్రీకాళహస్తి


ఆకట్టుకున్న కళాబృందాల ప్రదర్శన

న్యూస్‌రీల్

ప్రాచీన విద్యపై శిక్షణ


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీలు రాణిసదాశివమూర్తి, అప్పారావు

తిరుపతి సిటీ: ఎస్వీయూలోని మాలవ్య మిషన్ టీచర్ ట్రైనింగ్ సెంటర్‌లో యూజీసీ సహకారంతో వారం రోజుల పాటు జరిగే భారతీయ వేదిక జ్ఞాన విద్యావిధానం సముపార్జన అనే అంశంపై అధ్యాపకులకు శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఎస్వీ వేదిక్ వర్సిటీ రాణి సదాశివమూర్తి, ఎస్వీయూ వీసీ అప్పారావు ముఖ్యఅతిథులుగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రాచీన విద్యను ఆధునిక విద్యకు అనుసంధానం చేయడమే ప్రధాన లక్ష్యం యూజీసీ శిక్షణ ఇస్తుండడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో భౌతికశాస్త్ర విభాగాధిపతి ఆచార్య దేవప్రసాద్‌రాజు, ఆచార్య రుద్రమదేవి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 110 అర్జీలు


ఎస్పీ హర్షవర్ధన్ రాజుకు ఫిర్యాదులు అందజేస్తున్న బాధితులు


తిరుపతి క్రైం: తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 110 ఫిర్యాదులు అందినట్టు ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. ఇందులో దొంగతనాలు, ఆస్తి తగాదాలు, ఆర్థికపరమైన లావాదేవీలు ఉన్నాయన్నారు. వెంటనే సంబంధిత అర్జీలు పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు.

పెండింగ్ బకాయిలు చెల్లించండి


ఆపస్ క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఆ సంఘం అధ్యక్షుడు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయ, ఉద్యోగుల పెండింగ్ బకాయిలను తక్షణమే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) జిల్లా అధ్యక్షుడు తూకివాకం నాగరాజు డిమాండ్ చేశారు. తిరుపతి బైరాగిపట్టెడలోని ఆపస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు అందాల్సిన బకాయిలు పెండింగ్ ఉండడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నట్లు తెలిపారు. అనంతరం ఆపస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆ సంఘం ఉపాధ్యక్షుడు సుభాష్‌చంద్రదాస్, మేకల సుబ్రమణ్యం, దామోదర నాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు ధనంజయలు, రవిబాబు, వెంకటేష్ పాల్గొన్నారు.

అగాథంలో ఆక్వా



చిట్టమూరు మండలంలో రాయితీలు అందక బీడుగా వదిలేసిన ఆక్వా సాగు

'ఆక్వా రంగానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కల్పించిన రాయితీలను కొనసాగిస్తాం. అవసరాలకు అనుగుణంగా ప్రోత్సాహకాలను అందిస్తాం. మరిన్ని సబ్సిడీలను మంజూరు చేసి ఆదుకుంటాం' అంటూ యువగళం పాదయాత్రలో నారా లోకేష్ హామీలు గుప్పించారు. ఇచ్చిన మాట నెరవేర్చుకుంటామంటూ ఆర్భాటంగా శిలాఫలకం వేశారు. తీరా అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను గాలికొదిలేశారు. రొయ్యల రైతులను అగాథంలోకి నెట్టేశారు. కనీసం విద్యుత్ చార్జీల తగ్గింపును సైతం విస్మరించారు. దీంతో ఆక్వా సాగు గణనీయంగా పడిపోయింది. ఎగుమతులపై తీవ్రంగా ప్రభావం పడింది. రాష్ట్రానికి భారీగా వస్తున్న విదేశీ మారకద్రవ్యానికి గండి పడింది. చినబాబు బూటకపు హామీలకు రైతాంగం కుదేలైంది. దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. కనికరం లేని పాలనపై ఆగ్రహంతో రగిలిపోతోంది.

మైలు రాయికే పరిమితమైన చినబాబు హామీ

- యువగళం పాదయాత్రలో ఇచ్చిన మాటను విస్మరించిన లోకేష్
- విద్యుత్ రాయితీ అందక కుదేలైన రైతులు
- వేల ఎకరాల నుంచి వందల ఎకరాలకు పడిపోయిన రొయ్యల సాగు
- తగ్గిపోయిన ఎగుమతులు.. విదేశీ మారకద్రవ్యం

చిల్లకూరు:తీర ప్రాంత గ్రామాల రైతులు ఆక్వా సాగుకు దూరమవుతున్నారు. గతంలో రొయ్యల సాగు వేల ఎకరాల్లో ఉంటే.. ఇప్పుడు వందల ఎకరాలకు పడిపోయింది. రాష్ట్రానికి విదేశీ మారక ద్రవ్యము వచ్చే పరిస్థితి గగనమైపోయింది. గతంలో ఆక్వా జోన్ పరిధిలో ఉన్న రైతులకు విద్యుత్ చార్జీల్లో రాయితీ అందేది. కానీ, ఇప్పుడు కూటమి ప్రభుత్వం సబ్సిడీలకు మంగళం పాడింది. దీంతో ఏం చేయాలో దిక్కుతోచక రైతులు తల్లడిల్లిపోతున్నారు.


యువగళం పాదయాత్రలో ఆక్వా సాగుదారులను ఆదుకుంటామని లోకేష్ ఆవిష్కరించిన శిలాఫలకం

గాలిలో దీపంలా లోకేష్ హామీ

ఎన్నికలకు ముందు నారా లోకేష్ యువగళం పాదయాత్ర సందర్భంగా ఆక్వా రైతులకు వరాలు గుప్పించారు. జిల్లాలోని చిట్టమూరు మండలం, అరవపాళెం గ్రామ పొలిమేరలోకి వచ్చి 1,800 కిలోమీటర్ల దూరం పాదయాత్ర పూర్తయిన సందర్భంగా శిలాఫలకం వేశారు. ఆక్వా రైతులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎలాంటి రాయితీలు ఇస్తుందో.. వాటిని కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. మాట అయితే ఇచ్చేశారు కానీ, అధికారం చేపట్టాక పూర్తిగా విస్మరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు గడుస్తున్నా ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్ రూ.1.5 పైసలకు ఇచ్చిన దాఖలాలు లేవు. నాన్ జోన్‌లోని గుంతలను కూడా జోన్‌లో కలపాల్సింది పోయి నేడు అందరికీ ఒకే విద్యుత్ చార్జీలు అమలు చేస్తామని ప్రకటించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కరెంట్ చార్జీల బాదుడు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆక్వా రైతులకు అండగా నిలిచేందుకు జోన్‌లను ఏర్పాటు చేసింది. అందులోకి వచ్చిన వారికి రాయితీపై విద్యుత్‌ను ఇవ్వడంతోపాటుగా పలు రకాల సబ్సిడీలను కల్పించింది. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. సర్దుబాటు చార్జీలు.. సర్‌చార్జీలు ఇలా వాడుకున్న విద్యుత్ కన్నా ఎక్కువ బిల్లు కట్టాల్సి వస్తోంది. జోన్ పరిధిలోని సాగుదారులకు యూనిట్ ధర రూ.5.25 పైసల వరకు పడుతోంది. అదే జోన్‌లో లేని వారికి యూనిట్ ధర రూ.6.25 పైసలు వస్తోంది. దీంతో సగం మంది రైతులు ఆక్వా సాగుకు దూరమైపోయారు.

ఒడిదుడుకులు షురూ

రొయ్యలోని వెనామీ, టైగర్ సాగులో ఒడిదుడుకులు ఎదురవుతున్నాయి. ధరల పతనం, వైరస్‌ల విజృంభణ, దాణా ధరలు పెరిగి పోవడం వంటివి రైతులపై తీవ్రంగా ప్రభావం చూపుతున్నాయి. దీంతో పలువురు రైతులు ఆక్వా సాగును వదిలేస్తున్నారు. గతంలో తెచ్చిన అప్పులు కట్టలేక నానా ఇబ్బందులు పడుతున్నారు.

సిఫార్సుల మేరకే

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మత్స్యశాఖ ఇచ్చిన వినియోగదారుల జాబితా మేరకే రూ.1.5 పైసలకు యూనిట్ విద్యుత్‌ను అందిస్తున్నాం. కొత్తగా జోన్‌లను ఏర్పాటు చేసి జాబితాను అందిస్తే ఆ రైతులను కూడా గుర్తించి వారికీ రాయితీపై విద్యుత్‌ను అందిస్తాం.

– నరేంద్రరెడ్డి, డీఈఈ, డిస్కమ్, గూడూరు

బతుకు భారం..సాగుకు దూరం

తిరుపతి జిల్లాలో తీర ప్రాంతం 75 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ఇందులో చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లోనే ఆక్వా సాగుకు అనుకూలంగా ఉంటోంది. ఈ నాలుగు మండలాల్లోని పట్టా భూముల్లో 7,887 వేల ఎకరాలు, రికార్డులు లేని ప్రభుత్వ భూముల్లో మరో 5 వేల ఎకరాలలో ఆక్వా సాగును గతంలో చేసేవారు. అయితే జోన్ పరిధిలోకి విద్యుత్ రాయితీలను తీసుకుని రావడంతో ప్రభుత్వ భూముల్లో సాగుచేసుకునే వారికి ఇది వర్తించక పలువురు రైతులు ఆక్వా సాగును వదిలేశారు.

నాలుగు మండలాల్లో 24 జోన్లు

తీర ప్రాంతంలోని చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో ఆక్వా జోన్లు గతంలో 12 ఉండేవి. ప్రస్తుతం మరో 12 జోన్లు చేసేందుకు గ్రామ సభలు ఏర్పాటు చేస్తున్నాం. అన్నీ పూర్తయితే 24 జోన్లు వస్తాయి. ప్రభుత్వ భూమిలో ఆక్వా సాగు చేస్తుంటే వారు రెవెన్యూ అధికారుల దగ్గర సీటీసీ తీసుకుంటే రాయితీలు వర్తిస్తాయి.

– నాగరాజు, జిల్లా మత్స్యశాఖాధికారి, తిరుపతి

చార్జీల మోత



ఆక్వా జోన్ పరిధిలోకి వచ్చే తిప్పగుంటపాళెం సమీపంలో రొయ్యల గుంతలను లీజుకు తీసుకుని సాగు చేపట్టా. గతంలో జోన్ పరిధిలో ఉన్నందున యూనిట్‌కు విద్యుత్ చార్జీ రూ.1.5 పైసలు వచ్చేది. కూటమి ప్రభుత్వం వచ్చాక సర్‌చార్జీలు, ట్రూఅప్ చార్జీలు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ చార్జీస్ పేరుతో బాదేస్తున్నారు.

– కె.మదన్‌కుమార్‌రెడ్డి, ఆక్వా రైతు, తిక్కవరం, చిల్లకూరు మండలం

సాగు వదిలేశా



గతంలో ఆక్వా జోన్ పరిధిలో గుంతలు ఉండడంతో విద్యుత్ బిల్లులు అంతంగా ఉండేవి కావు. దీంతో మొత్తంగా 20 ఎకరాల వరకు సాగు చేసేవాడిని. ప్రస్తుతం జోన్ పరిధిలో 10 ఎకరాల లోపు ఉన్న వారికి మాత్రమే వర్తిస్తుందని చెప్పడంతో మొత్తం సాగు చేయకుండా కొంత వదిలేశా.

– ఎం.సుధీర్‌రెడ్డి, చిట్టమూరు మండలం

కవితల ఆహ్వానం

తిరుపతి కల్చరల్: అభ్యుదయ రచయితల సంఘం(అరసం), జిల్లా శాఖ ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా కవుల కవితా సంకలనానికి కవితలు ఆహ్వానిస్తున్నట్లు అరసం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యువశ్రీ మురళి, డాక్టర్ నెమిలేటి కిట్టన్న తెలిపారు. అరసం రాష్ట్ర నేత సాకం నాగరాజు పర్యవేక్షణలో ప్రచురించే ఈ కవితల ఎంపిక తుది నిర్ణయం అరసం తిరుపతి జిల్లా శాఖదేనని పేర్కొన్నారు. కవితలు పంపదలచిన కవులు 25 వరుసలకు మించకుండా, అభ్యుదయ సామాజిక నేపథ్యం గల కవితలకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. స్వీయ కవిత అని హామీ పత్రం జత చేసి కవితలను ఈనెల 28వ తేదీలోపు ఫొటోతో సహా 9491312522, 9490182636 ఫోన్ నంబర్లకు వాట్సాప్ ద్వారా పంపాలని సూచించారు.

కేవీకేలో పీఎం కిసాన్


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం బీహార్ రాష్ట్రంలోని భాగల్పూర్ జిల్లాలో 19వ విడత ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధిని విడుదల చేశారు. అలాగే పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమాలను రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు ప్రత్యక్ష ప్రసారం ద్వారా చూపించినట్లు కేవీకే సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ డాక్టర్ ఎస్.శ్రీనివాసులు తెలిపారు. ఇందులో భాగంగా ఉద్యాన శాస్త్రవేత్తలు పద్మజ, దివ్య, అనూష ఆరోగ్యకరమైన జీవితం కోసం ఔషధ మొక్కల వినియోగం, సాగులో ఉన్న వివిధ పంటల్లో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. పాడి పశువుల పెంపకంలో మెళకువలు, నేల, నీటి యాజమాన్య పద్ధతులు, భూసార పరీక్ష ఆధారిత ఎరువుల వాడకం తదితరాలను వివరించారు. అనంతరం పోషకాహార తోటల పెంపకం కోసం అవసరమైన విత్తన కిట్లు, ఔషధ మొక్కలు, నారు, మొక్కలు పంపిణీ చేశారు. ఇందులో జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.ప్రసాద్ రావు, ఏపీ ప్రకృతి వ్యవసాయ పథకం జిల్లా మేనేజర్ షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 78,892 మంది స్వామివారిని దర్శించుకోగా 25,930 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.55 కోట్లు సమర్పించారు. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది.

పీ-4 సర్వే వద్దు బాబోయ్

- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన సచివాలయ ఉద్యోగులు

తిరుపతి అర్బన్: పీ–4 (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్టనర్‌షిప్) సర్వే మా కొద్దు బాబోయ్ అంటూ సచివాలయ ఉద్యోగులు మొత్తుకుంటున్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ వెంకటేశ్వర్‌కు విన్నవించారు. వ్యక్తిగత డేటా ఇచ్చేందుకు కుటుంబీకులు నిరాకరిస్తున్నారని చెప్పారు. మార్చి 2వ తేదీకి 100శాతం సర్వే పూర్తి చేయాలని టార్గెట్ ఇచ్చారన్నారు.

సర్వేలపై సర్వేలు

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సర్వేలపై సర్వేలు నిర్వహిస్తోంది. సచివాలయ ఉద్యోగుల నేతృత్వంలో ఇప్పటికే 10కి పైగా సర్వేలు నిర్వహించింది. ఇందులో హౌస్‌హోల్డర్స్ సర్వే, మిస్సింగ్ సిటిజన్స్ సర్వే, ఫ్యాక్ట్ ఈకేవైసీ సర్వే(అగ్రికల్చర్), జియో ట్యాగింగ్, గ్రామ పంచాయతీ ఆస్తుల సర్వే, ఎన్పీసీఐ మ్యాపింగ్ సర్వే, ల్యాండ్ రికార్డింగ్ సర్వే, అగ్రికల్చర్ రిజిస్ట్రేషన్ల సర్వే, పశువుల గణన సర్వే, క్యాన్సర్ సర్వే, జనాభాకు సంబంధించి పురుషులు, మహిళలు సర్వే, 18 ఏళ్లు నిండిన వారి సర్వే, హౌసింగ్ డిమాండ్ సర్వే, ఎంఎస్ఎంఈ సర్వే, నాన్ రెసిడెంట్ ఏపీ సిటిజన్ సర్వే నిర్వహించింది. ఇప్పుడు తాజాగా పీ–4 సర్వేను అంటగట్టింది. ఒక్కో ఉద్యోగి 30 నుంచి 50 ఇండ్లు పంచుకుని డేటా సేకరించే పనిలో నిమగ్నమయ్యారు.


పీ-4 సర్వేలో సిబ్బంది

ఇంటింటా పీ–4 సర్వే దడ

పీ– 4 సర్వే పేరుతో సచివాలయ ఉద్యోగులు ఇంటింటా వెళ్లి 27 ప్రశ్నలు అడుగుతున్నారు. నివాసం ఉంటున్న కుటుంబ యజమాని పేరుతో మొదలు పెట్టి, ఇంట్లో ఉండే వస్తువులు, వాహనాలు, జీతభత్యాలు, వ్యాపారాలు, ఆర్థిక వివరాలకు సంబంధిం జాబితా సేకరిస్తున్నారు. ఆ వివరాలను చెప్పడానికి కుటుంబ సభ్యులకు దడపుడుతోంది. ఎప్పుడు ఏ పథకాన్ని తీసేస్తారోనన్న భయాందోళన వ్యక్తమవుతోంది.

భయమేస్తోంది



సచివాలయ ఉద్యోగులు పదేపదే సర్వేలంటూ ఇంటికి వస్తున్నారు. ఏ సర్వే చేస్తే ఏమో అనే ఆందోళన నెలకొంది. తాజాగా పీ–4 సర్వే వచ్చింది. ఈ సర్వేతో సంక్షేమ పథకాలు పోతాయనే భయాందోళన నెలకొంది.

– బాలకృష్ణ, వరదయ్యపాళెం

పీ-4 సర్వేతో పథకాలకు ఆటంకం రాదు



పీ–4 సర్వేతో మీ సంక్షేమ పథకాల కు ఆటంకం రాదు. ఎటువంటి అపోహలు పెట్టుకోకండి. పీ4 సర్వే ఈ నెల 20 నుంచి మొదలుపెట్టాం. ఫిబ్రవరి 2తో పూర్తి చేయాలి. ధనవంతులుగా ఉన్న టాప్ 10 నుంచి అట్టడుగు స్థాయిలో ఉన్న 20శాతం మందికి సాయం చేయడానికే ఈ పథకం.

– ఎస్.వెంకటేశ్వర్, కలెక్టర్, తిరుపతి జిల్లా

క్లుప్తంగా

ప్రాణదానం ట్రస్టుకు రూ.పది లక్షల విరాళం



డీడీని అదనపు ఈఓకు అందజేస్తున్న దాతలు

తిరుమల: శ్రీవెంకటేశ్వర ప్రాణదానం పథకంకు రూ.పది లక్షల విరాళాన్ని అదనపు ఈవో వెంకయ్య చౌదరికి హైదరాబాద్‌కు చెందిన భక్తుడు శ్రీనివాస్‌రెడ్డి విరాళంగా అందజేశారు. సోమవారం అదనపు ఈఓ కార్యాలయంలో డీడీ రూపంలో అందజేశారు.

పల్లెవెలుగుకు శివరాత్రి వేటు!

– శివరాత్రి పేరుతో 14 పల్లె సర్వీసులు రద్దు

తిరుపతి అర్బన్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల పేరుతో గ్రామీణ సర్వీసులపై తిరుపతి డిపో వేటు వేసింది. ఏకంగా ఐదు రోజుల పాటు 14 గ్రామాలకు చెందిన పల్లెవెలుగు సర్వీసులను నిలుపుదల చేసింది. సాధారణంగా బ్రహ్మోత్సవాలు లాంటి ప్రత్యేక కార్యక్రమాల్లో అదనపు సర్వీసులను వినియోగించాల్సి ఉంది. అయితే గ్రామీణ ప్రాంతాలకు సర్వీసులను నిలుపుదల చేయడం సరికాదని పలువురు విమర్శలు చేస్తున్నారు.

ఈ గ్రామాలకు బస్సులు రద్దు

తిరుపతి డిపో నుంచి మంగళవారం మొదలు ఐదు రోజుల పాటు నిలుపుదల చేసిన సర్వీసుల వివరాలు ఇలా ఉన్నాయి. విరాటపురం, వెంకట్రామాపురం, పల్లిపట్టు, రేణిగుంట, చంద్రగిరి, పాకాల, అనుప్పల్లి, అప్పళాయగుంట, పెనగలూరు, పల్లిపట్టు, ఓఎస్ గొల్లపల్లి, మూలపల్లి, అడపారెడ్డిపల్లి, గాదంకి సర్వీసులను రద్దు చేశారు. అంతేకాకుండా తిరుపతి నుంచి కాణిపాకంకు వెళ్లే 5, బెంగుళూరుకు వెళ్లే 2, విజయవాడకు వెళ్లే 6 సర్వీసులు రద్దు చేశారు.

అపాచీ బస్సు బోల్తా

– పలువురికి గాయాలు



బోల్తా పడిన అపాచీ బస్సు

వరదయ్యపాళెం: సూళ్లూరుపేట–బీఎన్‌కండ్రిగ ప్రధాన రోడ్డు మార్గంలోని సాధనవారిపాళెం వద్ద అపాచీ బస్సు బోల్తా పడిన ఘటనలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. సోమవారం రాత్రి 7.30 గంటల సమయంలో బీఎన్‌కండ్రిగ నుంచి తడ మండలం, మాంబట్టు వద్ద గల అపాచీ పరిశ్రమకు కార్మికులను తీసుకెళ్తున్న బస్సు వరదయ్యపాళెం మండలంలోని సాధనవారిపాళెం సమీపంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును తప్పించే క్రమంలో అదుపు తప్పిబోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఐదుగురికి స్వల్పగాయాలయ్యాయి. ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపడుతున్నట్లు ఎస్‌ఐ మల్లికార్జున తెలిపారు.

ఆ రోడ్ల పరిస్థితి అంతేనా?

ఏడాదిన్నర క్రితం టెండర్ల ప్రక్రియ పూర్తి

- నేటికీ ప్రారంభానికి నోచుకోని నిర్మాణ పనులు
- అధ్వానంగా మారుతున్న రోడ్లు
- అవస్థల్లో ప్రయాణికులు



నాగలాపురం-చిన్న పాండూరు ప్రధాన రోడ్డు మార్గంలో బావులను తలపిస్తున్న గుంతలు

వరదయ్యపాళెం: జిల్లాలో భూగర్భ గనులు, ఖనిజాలు (మైన్స్ అండ్ మినరల్స్) శాఖకు వచ్చే సీనరీ చార్జెస్ ద్వారా కొంత మేరకు రోడ్లు, భవనాల శాఖకు చెందిన రోడ్ల అభివృద్ధికి గత ప్రభుత్వం కేటాయించింది. ఈ నిధులన్నీ కలెక్టర్ పర్యవేక్షణలో ఉంటాయి. ఆ మేరకు తిరుపతి ఆర్‌అండ్‌బీ డివిజన్ పరిధిలోని శ్రీకాళహస్తి, పుత్తూరు ఆర్‌అండ్‌బీ సబ్‌డివిజన్ల పరిధిలో 9 పనులకు సంబంధించి రూ.2.85 కోట్లు మైన్స్ అండ్ మినరల్స్ ద్వారా కేటాయింపులు జరిగాయి. ఈ నిధులకు సంబంధించి ఏడాదిన్నర క్రితం టెండర్ల ప్రక్రియను పూర్తిచేసింది. కాంట్రాక్టర్ అగ్రిమెంటు ప్రక్రియ కూడా పూర్తిచేశారు. ఇదంతా జరిగి ఏడాదిన్నర కావస్తున్నా నేటికీ నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. అయితే 3 పనులు పూర్తి చేసినప్పటికీ సంబంధిత పనులకు బిల్లులు కూడా చెల్లింపులు చేయలేదు. దీని కారణంగానే మిగిలిన పనులు చేపట్టలేదని సంబంధిత కాంట్రాక్టర్లు చెబుతుండడం గమనార్హం.

కేటాయింపులు ఇలా..

శ్రీకాళహస్తి ఆర్‌అండ్‌బీ సబ్‌డివిజన్ పరిధిలో వరదయ్యపాళెం, పెద్ద పాండూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్గంలో రెండు పనులకు రూ.80 లక్షలు కేటాయించారు. వరదయ్యపాళెం పోలీస్ స్టేషన్ నుంచి త్రయంబకేశ్వరాలయం వరకు సిమెంటు రోడ్డు నిర్మాణం కోసం రూ.40లక్షలు, అదే మార్గంలోని పెద్ద పాండూరు గ్రామంలో సిమెంటు రోడ్డు నిర్మాణానికి మరో రూ.40లక్షలు మంజూరు చేశారు. అయితే ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు. అలాగే సత్యవేడు, నాగలాపురం మండలాల పరిధిలో నాగలాపురం, చిన్న పాండూరు ప్రధాన రోడ్డు మార్గంలో మూడు చోట్ల బీటీ రోడ్ల నిర్మాణానికి ఒక్కో పనికి రూ.40 లక్షల చొప్పున మూడు పనులకు రూ.1.2 కోట్లు మంజూరు చేశారు. వీఆర్‌కండ్రిగ- టీపీపాళెం రోడ్డు మార్గంలో బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.40లక్షలు కేటాయించారు. అయితే ఈ పనులు కూడా నిర్మాణానికి నోచుకోలేదు.



వరదయ్యపాళెం-పాండూరు ఆర్‌అండ్ బీ మార్గంలో పెద్ద పాండూరు వద్ద రోడ్డు దుస్థితి



వరదయ్యపాళెంలోని త్రయంబకేశ్వరాలయం వద్ద ఛిద్రమైన రోడ్డు

రద్దు కాని టెండర్లు

సాధారణంగా టెండర్ ద్వారా పనులు చేజిక్కించుకున్న కాంట్రాక్టర్ సంబంధిత శాఖ నిర్దేశించిన సమయానికి పనులు పూర్తిచేయాలి. లేని పక్షంలో సంబంధిత పనులను రద్దు చేయొచ్చు. ఆ దిశగా ఏడాదిన్నర క్రితం మైన్స్ అండ్ మినరల్స్ ద్వారా కేటాయించిన నిధులకు ఆర్ అండ్ బీ శాఖ టెండర్ల ప్రక్రియ పూర్తిచేసింది. అయితే సంబంధిత పనులకు మూడు నెలల నుంచి ఆరు నెలల లోపు పనులు పూర్తి చేసేందుకు కాల పరిమితి విధించారు. అయితే ఆ సమయం పూర్తయ్యి ఏడాది కావస్తున్నా సంబంధిత కాంట్రాక్టర్‌కు కేటాయించిన పనులు రద్దు చేసేందుకు ఎందుకు వెనుకాడుతున్నట్లో అర్థం కాని పరిస్థితి.

రెంటికీ చెడ్డరేవడిగా రోడ్ల పరిస్థితి

దేవుడు కరుణించినా.. పూజారి వరమివ్వని సామెత మాదిరిగా మైన్స్ అండ్ మినరల్స్ ద్వారా ఆర్ అండ్ బీ రోడ్ల అభివృద్ధికి కేటాయించిన నిధుల పరిస్థితి మారింది. ఆ నిధుల ద్వారా నిర్మాణ పనులు జరగకపోవడంతో నూతనంగా ప్రత్యామ్నాయ పనులు కూడా ప్రభుత్వం మంజూరు చేయడం లేదు. సంబంధిత రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. బావులను తలపించే విధంగా గుంతలు ఏర్పడ్డాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుచోట్ల తాత్కాలిక మరమ్మతుల ద్వారా ఆర్ అండ్ బీ రోడ్లకు ప్యాచ్ వర్కులు చేస్తున్నారు. అయితే మైన్స్ అండ్ మినరల్స్ ద్వారా నిధులు కేటాయించి టెండర్ల ప్రక్రియ పూర్తయిన కారణంగా సంబంధిత రోడ్లకు ప్యాచ్ వర్కులు కూడా మంజూరు చేయలేదు. దీంతో ఈ రోడ్ల పరిస్థితి రెంటికీ చెడ్డరేవడిగా మారింది.

బిల్లుల్లో జాప్యం

మైన్స్ అండ్ మినరల్స్ ద్వారా సత్యవేడు నియోజకవర్గంలోని పలు ఆర్ అండ్ బీ రోడ్ల అభివృద్ధికి సంబంధించి 9 పనులకు గాను రూ.2.85కోట్లు మంజూరు చేశారు. పనులను చేజిక్కించుకున్న కాంట్రాక్టర్ నాగలాపురం–చిన్న పాండూరు రోడ్డు మార్గంలో రూ.40 లక్షలతో బీటీ రోడ్డు, పిచ్చాటూరు మండలంలోని రామగిరి ఆలయానికి వెళ్లే రోడ్డు మార్గంలో రూ.55లక్షలతో మరో బీటీ రోడ్డును నిర్మాణం చేశారు. ఇలా రెండు పనులకు సంబంధించి రూ.95లక్షలతో పనులు పూర్తి చేశారు. అయితే ఇప్పటిదాకా సంబంధిత పనులకు సంబంధించి బిల్లులు రాలేదని పనులు చేసిన కాంట్రాక్టర్ వాపోతున్నాడు.

సర్వేతో తలకు మించిన పనిభారం



కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న రాజా

తిరుపతి అర్బన్: సర్వేల పేరుతో సచివాలయ ఉద్యోగులతోపాటు వైద్య విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులకు పనిభారం పెరుగుతోందని ఉమ్మడి చిత్తూరు జిల్లా ఏపీ హంస సంఘం అధ్యక్షుడు రాజా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌ను కలిసి తన గోడు వెళ్లబోసుకున్నారు. రైతులు వ్యవసాయ పనులకు, పేదలు ఉపాధి పనులకు వెళ్తున్నారని, ఇంటిపట్టున ఎవ్వరూ ఉండడం లేదని పేర్కొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించడమే లక్ష్యం

తిరుపతి సిటీ : నూతన ఆవిష్కరణలు సాధించేలా విద్యార్థినులను ప్రోత్సహించడమే సాంకేతిక ఉత్సవ్ లక్ష్యమని మహిళా వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ మల్లికార్జున, ప్రొఫెసర్ కేఎల్ నారాయణ తెలిపారు. వర్సిటీలోని మెకానికల్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో సోమవారం మెకారేనా–2025 సాంకేతిక ఉత్సవ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థినుల్లో సృజనాత్మకతను పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. అనంతరం పలు సాంకేతిక ఈవెంట్లు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు వీరారెడ్డి, సత్యనారాయణ, జోత్స్న, స్నేహలత, సురేఖ పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు 241 అర్జీలు

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు 241 అర్జీలు వచ్చినట్టు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. ఇందులో 164 అర్జీలు రెవెన్యూ సమస్యలపై వచ్చాయన్నారు. చిన్నచిన్న సమస్యల పరిష్కారానికి మళ్లీ తిప్పుకోవడం మంచి పద్ధతి కాదని సిబ్బందిని ఆదేశించారు. జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, రోజ్‌మాండ్, శివశంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుడుకి వీల్‌చైర్

కలెక్టరేట్‌లో సోమవారం సత్యవేడు నియోజకవర్గంలోని కేవీబీపురం మండలం, కొండల్లోఆదవరం గ్రామానికి చెందిన వలమల వెంకటేశ్వర్‌కు వీల్‌చైర్‌ను అందించారు. రూ.60 వేల విలువైన ఈ వీల్‌చైర్‌ను కలెక్టర్, డీఆర్వో చేతుల మీదుగా అందించారు. విభిన్న ప్రతిభావంతుల జిల్లా అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.



విభిన్న ప్రతిభావంతుడికి వీల్‌చైర్ అందిస్తున్న కలెక్టర్, జేసీ



గ్రీవెన్స్‌లో అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్

మాకు న్యాయం చేయండి

తమకు న్యాయం చేయాలంటూ 108 ఉద్యోగులు అధికారులకు మొరపెట్టుకున్నారు. గ్రీవెన్స్ సందర్భంగా అధికారులకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. 108ను కొత్త సర్వీస్ ప్రొవైడర్‌కు అప్పగించే నిమిత్తం తమకు నష్టం జరుగుతోందని వాపోయారు. ఆ మేరకు డీఎంహెచ్‌వో, ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్‌కు వినతిపత్రాన్ని అందించారు. అలాగే తిరుపతి ఆర్డీవో రామమోహన్, తహసీల్దార్ కేపీ భాగ్యలక్ష్మి తమ కార్యాలయంలో అర్జీలను స్వీకరించారు.



డీఎంహెచ్‌ఓకు అర్జీ ఇస్తున్న 108 ఉద్యోగులు

క్రీడాపరికరాల వితరణ



క్రీడా పరికరాలు అందజేస్తున్న జపనీస్ కంపెనీ ప్రతినిధులు

సత్యవేడు: మండలంలోని మల్లవారిపాళెం వెస్టు అంగన్‌వాడీ కేంద్రానికి క్రీడా పరికరాలను శ్రీసిటీలోని జపనీస్ కంపెనీ గ్రూప్(ఎస్‌జేసీజీ) అందజేసింది. కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాలలో భాగంగా రూ.2.1 లక్షల విలువ చేసే క్రీడా పరికరాలను పంపిణీ చేసింది. ఇందులో ఊయల, జారుడు బండ, స్వింగ్, స్లైడ్, మెర్రిగో తదితర ఆటవస్తువులు ఉన్నాయి. ఎస్‌జేసీజీ ప్రతినిధులు యుయిచి టోమిటా(ఐసాన్ ఆటో పార్ట్స్ ఇండియా), యుజీ కొమోరి(డైకి అల్యూమినియం ఇండస్ట్రీస్), హరిహరన్ (ఐఎంపీఓ), ఫుమిహిటో ఇటో(నిట్టన్ ఇండియాటెక్) తకాషి సగావా, మోసుకే మగోషి(అల్పాక్ఇండియా), శ్రీసిటీ డైరెక్టర్ (సీఎస్ ఆర్) నిరీష రెడ్డి సమక్షంలో క్రీడా పరికరాలు అంగన్‌వాడీ సిబ్బందికి అందజేశారు. శ్రీసిటీ ఫౌండేషన్ మేనేజర్ సురేంద్ర నాద్‌కుమార్ పాల్గొన్నారు.

యాప్‌లో రూ.24.66 లక్షలు మాయం!

- సైబర్ నేరగాళ్ల వలలో ఎస్వీయూ ప్రొఫెసర్

తిరుపతి రూరల్: ఎస్వీయూ అధ్యాపకుడు సైబర్ నేరగాళ్ల వలలో పడ్డారు. ఏకంగా రూ.24.66 లక్షలు పోగొట్టుకున్నారు. తిరుపతి రూరల్ మండలం, తాటితోపుకు చెందిన సురేష్ ఎస్వీ యూనివర్సిటీలో జియాలజీ డిపార్ట్‌మెంట్‌లో ఫ్యాకల్టీ ప్రొఫెసర్‌గా పనిచేస్తూ ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసానికి గురయ్యారు. 2025 జనవరి 12న ఆయన మొబైల్ నంబర్ A7* VIP sharekhan Communication అనే వాట్సాప్ గ్రూపులో చేరింది. ఈ గ్రూపులో చాలా మంది చాటింగ్ చేస్తూ, అధిక లాభాలు కలిగించే ఆన్‌లైన్ ట్రేడింగ్ అవకాశాలను సూచించారు. ఈ గ్రూపులో sharekhan Official పేరుతో ఉన్న నంబర్ల నుంచి ఆయనకు లింకులు పంపి, sharekhansecurities అనే ఫేక్ ట్రేడింగ్ యాప్ డౌన్లోడ్ చేసుకునేలా ప్రోత్సహించారు. ఈ యాప్ ద్వారా వారు లాభాలు వస్తాయని చెప్పడంతో యూనియన్ బ్యాంకు అకౌంట్ ద్వారా వివిధ బ్యాంకు ఖాతాలకు (వెస్ట్ బెంగాల్ బంధన్ బ్యాంకు, ఇతర అకౌంట్లు) రూ.24.66లక్షలు ఇన్వెస్ట్ చేశారు. బాధితుడు ఇన్వెస్ట్‌మెంట్ పోర్ట్‌పోలియో విలువగా 2కోట్ల 14లక్షల 14 వేల 240 రూపాయలు చూపించారు. అంతేకాక రూ.44లక్షలు ట్రేడింగ్ కోసమని ఇవ్వనున్నట్టు అందులో పేర్కొన్నారు. కానీ ఆయన మొత్తం డబ్బును విత్‌డ్రా చేసుకునేందుకు ప్రయత్నించినపుడు ముందుగా లోన్ అమౌంట్ చెల్లించాలని నేరగాళ్లు ఒత్తిడి తీసుకొచ్చారు. ఈ క్రమంలో మోసం జరిగిందని గుర్తించిన సురేష్ మొదట సైబర్‌క్రైమ్ టోల్ ఫ్రీ నంబరుకు.. ఆ తరువాత తిరుపతి రూరల్ సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

100 పడకల ఆస్పత్రిగా ఈఎస్ఐ

- ఫలించిన ఎంపీ గురుమూర్తి కృషి

తిరుపతి తుడా: తిరుపతి ఈఎస్ఐ ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా మారుస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. దాదాపు 15 ఏళ్లుగా కార్మికులు, సిబ్బంది ఎదురు చూస్తున్న తిరుపతి కార్మిక శాఖ బీమా ఆస్పత్రి వంద పడకల కల ఎట్టకేలకు నెరవేరింది. తిరుపతిలోని యాభై పడకల ఆస్పత్రిని వంద పడకలకు పెంచుతూ సోమవారం రాష్ట్ర ప్రభుత్వ కార్మిక, ఫ్యాక్టరీ, బీమా వైద్య శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గత నెల జనవరి 2 వ తేదిన విజయవాడలో జరిగిన రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో తిరుపతి ఆస్పత్రిని 100 పడకలకు పెంచుతూ మంత్రి వర్గం నిర్ణయం తీసుకొంది. ఇందులో 26 స్పెషలిస్ట్ డాక్టర్లు, 60 మంది నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది, 11 మంది కార్యాలయపు సిబ్బంది, మిగతా 94 పోస్టులు నర్సింగ్, స్వీపింగ్, సెక్యూరిటీ పోస్టులకు అనుమతి ఇచ్చినట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. దీనిపై ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.శ్యాంబాబు, డాక్టర్లు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

ఈఎస్ఐ ఆస్పత్రి భవనం





శుభపరిణామం

ఈఎస్ఐ ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయడానికి పలుమార్లు కేంద్ర ఆరోగ్యశాఖ అధికారులు కలిసి విన్నవించాము. ఇందుకోసం గతంలో పలుమార్లు అధికారులు ఆస్పత్రిని పరిశీలించారు. పార్లమెంట్‌లోనూ ఈ విషయంపై గళమెత్తాం. ఢిల్లీ వేదికగా పలుమార్లు అధికారులను, మంత్రులను కలసి విన్నవించాం. ఎట్టకేలకు ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేయడం సంతోషంగా ఉంది.– ఎం గురుమూర్తి, ఎంపీ, తిరుపతి

సూర్య, చంద్ర ప్రభలపై సర్వాంతర్యామి



నాలుగుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు కటాక్షిస్తున్న గోవిందుడు



చంద్రప్రభ వాహనంపై విహరిస్తున్న సామివారు

చంద్రగిరి: శ్రీనివాస మంగాపురంలో జరుగుతున్న వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం శ్రీమన్నారాయణుడి అలంకరణలో స్వామివారు సూర్యప్రభ వాహనంపై విహరిస్తూ కనువిందు చేశారు. రాత్రి స్వామివారు చంద్రప్రభ వాహనంపై దర్శనమిచ్చారు.ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

వెంకన్న బ్రహ్మోత్సవాల్లో 8వ రోజైన అయిన మంగళవారం ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వ వాహనాలపై స్వామివారు విహరించనున్నారు.

నగలు కొల్లగొట్టి.. క్యాసినోలో పోగొట్టి!

- ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడిన యూనియన్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్
- తాకట్టు నగలతో 50 రోజుల్లో రూ.2.5 కోట్లు బెట్టింగ్
- పోలీసుల అదుపులో సూత్రధారి
- కూపీ లాగుతున్న పోలీసులు

వరదయ్యపాళెం: నియోజకవర్గంలోని నాగలాపురం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో తాకట్టుకొచ్చిన ఐదున్నర కేజీల బంగారు ఆభరణాలను పక్కదారి పట్టించిన బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ సూర్యతేజ అక్రమాల పుట్ట కదులుతోంది. ప్రధానంగా సూర్యతేజ ఆన్‌లైన్ బెట్టింగ్ మోజు తన నెత్తి మీదకు తెచ్చుకున్నట్లు తెలుస్తోంది. ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యాపకానికి గురైన ఏకంగా ఆన్‌లైన్ క్యాసినో ఆటకు అలవాటు పడ్డాడు. దీంతో వచ్చే జీతం కుటుంబ అవసరాలకు సరిపోతుండడంతో ఏకంగా బ్యాంక్‌కు వచ్చిన తాకట్టు నగలపై కన్నువేశాడు. తాకట్టు నగలను బయటకు తరలించి ఎంచక్కా క్యాసినో ఆటను కొనసాగింపజేశాడు. బ్యాంక్‌లో బాధ్యత గల అసిస్టెంట్ మేనేజర్ స్థాయి ఉద్యోగికి ఇంత స్థాయిలో నగల గోల్‌మాల్‌కు పాల్పడాల్సిన అవసరం ఏమొచ్చింది అన్న ఖాతాదారుల అనుమానాలకు సంబంధించి ఒక్కొక్కటిగా నివృత్తి కలిగే భయంకర నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. పూర్తి వివరాలు తెలిసేందుకు మరో రెండు రోజులు వేచి చూడాలి.

ఆటాడేశాడు!

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడిన అసిస్టెంట్ మేనేజర్ సూర్యతేజ ఏకంగా 50 రోజుల్లో రూ.2.5 కోట్లు క్యాసినో ఆట ఆడేశాడు. రోజుకు రూ.5లక్షల చొప్పున క్యాసినోలో బెట్టింగ్‌లకు పాల్పడి చేతులు కాల్చుకున్నట్లు సమాచారం.



నగల గోల్‌మాల్ సూత్రధారి సూర్యతేజ

పోలీసుల అదుపులో సూర్యతేజ!

నగల గోల్‌మాల్ వ్యవహారంలో ప్రధాన సూత్రధారి అసిస్టెంట్ మేనేజర్ సూర్యతేజ అని తేలింది. ఈ కేసుకు సంబంధించి సీఐ పర్యవేక్షణలో దర్యాప్తు జరుగుతోంది. ఆ మేరకు సత్యవేడు సర్కిల్‌లో సూర్యతేజను అదుపులోకి తీసుకుని లోతుగా విచారణ చేస్తున్నారు.

ఆడిట్ అధికారికి ఎరచూపిన సూర్యతేజ

ఈ నెల 10న బ్యాంక్‌లో ఆడిట్ కోసం పుత్తూరు నుంచి ఆడిట్ అధికారి అసిస్టెంట్ మేనేజర్ సూర్యతేజతో కలిసి బ్యాంకుకు బయలుదేరాడు. మార్గ మధ్యం వరకు వచ్చిన తర్వాత నగల గోల్‌మాల్ గురించి ముందుగానే సూర్యతేజ ఆడిట్ అధికారికి ఒక్కొక్కటిగా చెవిలో వేశాడు. తనకు సహకరిస్తే మీకు కూడా ఓ పది బ్యాగుల్లో తాకట్టుకొచ్చిన నగలను బయటకు తెచ్చి బయట తాకట్టు పెట్టి నగదు ఇస్తానని, ఆ మొత్తం కూడా నేను భరించుకుంటానని ఆడిట్ అధికారికి ఆఫర్ చేయడం గమనార్హం. అయితే ఆడిట్ అధికారి మాత్రం ఈ అక్రమాల తంతు తన చెవికెక్కిన మరుక్షణమే బ్యాంకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చకచకా పక్కదారి పట్టిన నగల వ్యవహారాన్ని వెలికి తీసి ఉన్నతాధికారులకు నివేదించాడు.

ట్రావెల్స్ బస్సు బోల్తా

- 17 మందికి గాయాలు



ప్రమాదానికి గురైన బస్సును క్రేన్ సాయంతో తీస్తున్న సిబ్బంది



ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎస్‌ఐ బ్రహ్మనాయుడు

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట బైపాస్ రోడ్డులోని ఎంఆర్ గ్రాండ్ హోటల్ సమీపంలో పాండిచ్చేరి నుంచి విజయవాడ వెళుతున్న ట్రావెల్స్ బస్సు సోమవారం వేకువ జామున 1.30 గంటల ప్రాంతంలో అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 34 మంది ప్రయాణికులు ఉన్నారు. ఇందులో 17 మంది గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ బ్రహ్మనాయుడు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇందులో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో అందులో ఇద్దరిని చెన్నైకి, ఒకరిని నెల్లూరుకు తరలించారు. మిగిలిన 14 మందికి ప్రాథమిక వైద్యం అందించి పంపించారు. గాయపడిన వారందరూ విజయవాడ, చెన్నైకి చెందిన వారేనని తెలిపారు. బస్సు అతివేగం వల్లే ప్రమాదానికి గురైందని తెలిపారు.

చికెన్ మేళా

- చికెన్‌లో అధిక ప్రొటీన్స్
- ఆరగిద్దాం రండి

తిరుపతి తుడా: 'చికెన్ పట్ల ఎవరికీ ఎలాంటి అపోహలు వద్దు. నిర్భయంగా ఆరగించండి' అని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవికుమార్ తెలిపారు. స్థానిక బైరాగి పట్టెడలోని బాబూ జగజ్జీవన్ పార్క్‌లో సోమవారం చికెన్, కోడి గుడ్లుపై అవగాహన సదస్సు నిర్వహించాయ. మాంసప్రియులు చికెన్ వంటకాలను ఆస్వాదిస్తూ ఆరగించారు. ఆయన మాట్లాడుతూ చికెన్‌లో అధిక పోషకాలు ఉంటాయన్నారు. జిల్లాలో బర్డ్‌ఫ్లూ ప్రభావం లేదని చెప్పారు. అనంతరం 700 కేజీల చికెన్ని, 3 వేల కోడిగుడ్లుని వండి స్టాల్స్ ఏర్పాటు చేసి ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో హోమ్ సైన్స్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ, ఎన్ఈసీసీ ఉమామహేశ్వరి, శ్రీనివాసులునాయుడు, బాలాజీ, ప్రణీత్ పాల్గొన్నారు.



చికెన్.. జనం వచ్చెన్!



చికెన్ ఆరగిస్తున్న యువతి